జాతీయ దినపత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 187 | గురువారం | 23-7-2026

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD
వెల: రూ.5/- పేజీలు: 08



## మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

- భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు.

- మిగతా 2వ పేజీలో

## హస్తం, కమలం శ్రేణుల పోటాపోటీ నిరసనలు

- రాళ్లు, కర్రలతో కొట్టుకున్న ఇరు వర్గాలు
- రణరంగంగా మారిన బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయ ప్రాంతాలు

గన్ ఫౌండ్రి: దేశ రాజధానిలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితర నేతలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వగా, దేశ ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్ వ్యవహరించన తీరును నిరసిస్తూ బీజేపీ గాన్ధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో బుధవారం గాంధీభవన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి.


2లో



## పోలీసు రాజ్యం నడవదు

- నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్/నాంపల్లి: ప్రజాస్వామ్య భారత్‌లో పోలీసు రాజ్యం నడవదని, విద్యార్థులు, యువకుల ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గక తప్పదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆత్మఘోషకు కారణమైన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతాన్ని ఈ దేశం మర్చిపోదని వ్యాఖ్యానించారు. నీట్ ఘటనపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ ఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు శాంతియుత ఆందోళన చేస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో 'చలో లోక్ భవన్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో నియంత పాలన సాగుతోందని మండిపడ్డారు. ప్రశ్నపత్రం లీక్ చేసి 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేసిన మోదీ ప్రభుత్వం సిగ్గులేకుండా ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేకుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న రాహుల్‌గాన్ధీతోపాటు ఇతర విపక్ష ఎంపీలను అరెస్టు చేయడం దారుణమన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని, ఈ ఉదంతంపై పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

- మిగతా 2వ పేజీలో

## పబ్లిసిటీ కోసం లాఠీ దెబ్బలు తింటారా?

పోలీసులపై హైకోర్టు ఆగ్రహం కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు నోటీసులు



## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

- కుమారుడి ప్రమాద కేసులో కుట్ర ఆరోపణలు
- శ్రీకాకుళంలోని నివాసం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఇంటి వద్ద వైకాపా కార్యకర్తలు చేరడంతో ఉద్రిక్తత
- కొడుకు చేసిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి
- కుమారుడిని కాపాడేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు
- మరో వ్యక్తిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారని అభియోగం
- బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని కేసు నమోదు

శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకోవడంతో

- మిగతా 2వ పేజీలో

## హామీ ఇస్తే దీక్ష విరమిస్తా..

- కేంద్రానికి సోనమ్ వాంగ్‌చుక్ లేఖ..
- నిరాహార దీక్ష విరమించేందుకు సిద్ధమైన సోనమ్ వాంగ్‌చుక్.
- యువ నిరసనకారులపై చర్యలు ఉండవని హామీ కావాలని షరతు.
- నడ్డా, జితేంద్ర సింగ్‌కు లేఖ రాసిన వాంగ్‌చుక్.
- హామీ లేకపోతే నిరవధిక దీక్ష కొనసాగిస్తానని స్పష్టం


2లో



### పొగాకు రైతుల సమస్యలపై
## గట్టిగా పోరాడుతాం

- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై వైఎస్ జగన్ మండిపాటు
- ఈ ప్రభుత్వంలో దళారులదే రాజ్యం
- ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు.. ఆక్వా రైతులదీ అదే స్థితి
- వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ఎక్కడికక్కడ దోపిడీ

అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ తీరు వల్ల రాష్ట్రంలో పొగాకు రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, వారి సమస్యలపై పోరాటం సాగించి అండగా.. తోడుగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. చంద్రబాబు పాలనలో అంతా దళారులదే రాజ్యం అని, వ్యాపారులంతా సిండికేట్‌గా మారి యథేచ్ఛగా

### మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..
## భారీగా అభివృద్ధి చేస్తా

- మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పేదలకు శాశ్వత పట్టాల పంపిణీ
- ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్న లోకేశ్
- మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్న మంత్రి
- రూ.1800 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కేంద్ర నిధులతో ఎంపీ పెమ్మసాని సహకారంతో అభివృద్ధి పనులు

2లో




2లో

## సీసీఐపై వైఖరి చెప్పండి

- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ బహిరంగ లేఖ
- ఆదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణపై వైఖరి చెప్పాలని డిమాండ్
- రాష్ట్రం రూ.250 కోట్లు ఇస్తేనే పరిశీలిస్తామన్న కేంద్ర మంత్రి
- ఎన్నికల హామీని కాంగ్రెస్ విస్మరించిందని కేటీఆర్ విమర్శ

## పబ్లిసిటీ కోసం లాఠీ దెబ్బలు తింటారా?

పబ్లిసిటీ కోసం విద్యార్థులు చలో పార్లమెంట్ ర్యాలీ చేపట్టారన్న పోలీసుల వాదనపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సీసీ కెమెరాలు, పోలీసుల బాడీ కెమెరాల ఫుటేజీలు.. నిరసనలకు సంబంధించిన అన్ని డిజిటల్ రికార్డులను భద్రపరచాలని ఆదేశించింది. విద్యార్థులపై పోలీసులు అతిగా బలప్రయోగం చేశారా? అయితే సీసీటీవీ వీడియోలు భద్రపరచాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది. జూలై 20, 21 తేదీల్లో జరిగిన ఘటనలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, వీడియోగ్రఫీతో పాటు అన్ని సంబంధిత రికార్డులను భద్రపరచాలని ఆదేశించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసి నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు దాఖలు చేసిన రెండు ప్రజాహిత వ్యాజ్యాలపై విచారణ చేపట్టిన కోర్టు.. ఇది ఒక్క వ్యక్తికి సంబంధించిన సంఘటన కాదని, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశమని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున హాజరైన న్యాయవాది.. పోలీసులపై ఆరోపణలు చేసిన వారు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవచ్చని వాదించారు. అయితే హైకోర్టు ఆ వాదనతో ఏకీభవించలేదు. "ఇది ఒక ఒంటరి సంఘటన అయితే వేరేలా చూసేవాళ్లం. కానీ ఇది అలాంటి ఘటన కాదు. కాబట్టి అధికారుల నుంచి అధికారిక సమాధానం అవసరం." అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణ ముగిసే వరకు ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను భద్రపరచాలని కోర్టు స్పష్టం చేసింది. సీసీటీవీ ఫుటేజ్, వీడియోగ్రఫీ, ఇతర ఎలక్ట్రానిక్ రికార్డులు, పోలీసుల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం భద్రపరచాలని ఆదేశించింది.ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 11కు వాయిదా వేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎన్. హరిహరన్ వాదిస్తూ.. విద్యార్థులు రాజ్యాంగబద్ధమైన శాంతియుత నిరసన హక్కును వినియోగించుకుంటున్నారని, అయితే పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు. పిటిషన్లలో పేర్కొన్న ముఖ్య ఆరోపణలు.. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం, ఎలక్ట్రిక్ బ్యాటన్ల వినియోగం, విద్యార్థులు, మహిళలపై దాడులు, 90 మందికిపైగా నిరసనకారులు గాయపడటం, మహిళా నిరసనకారులతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. పలువురు పోలీసులు నేమ్‌ప్లేట్లు లేకుండా లేదా సాధారణ దుస్తుల్లో విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని కూడా పిటిషనర్లు కోర్టును కోరారు.

## హామీ ఇస్తే దీక్ష విరమిస్తా..

నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, తన కేంద్ర ప్రభుత్వానికి కొన్ని షరతులు విధించారు. ఆస్పత్రిలో తనను పరామర్శించి నిరాహారదీక్ష విరమించాలని కోరిన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు వాంగ్‌చుక్ లేఖ రాశారు. చర్చల సందర్భంగా తన డిమాండ్లలో కొన్నింటిని సానుకూలంగా పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన చెప్పారు. పేపర్ లీక్ తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం ఇవ్వాలని , విద్యాశాఖ మంత్రి రాజీనామాను కూడా పరిగణలోకి తీసుకోవాలని, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి పార్లమెంట్‌లో చర్చ జరగాలని వాంగ్‌చుక్ తన లేఖలో డిమాండ్ చేశారు. చలో పార్లమెంట్ మార్చ్‌పై పోలీసుల బలప్రయోగం జరిగినప్పటికీ ప్రదర్శన అత్యంత శాంతియుతంగా కొనసాగిందని ఆయన అన్నారు. నిరసనకారుల సహనం, నిబద్ధత దేశం, ప్రపంచం చూసిందని అన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న వారిపై చట్టబద్ధమైన కేసులు, వేధింపులు, ప్రతీకార చర్యలు ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తాయని వాంగ్‌చుక్ తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రమంత్రుల సమావేశం తర్వాత, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు కూడా తన నిరాహార దీక్షను విరమించాలని కోరతూ లేఖ రాసినట్లు వాంగ్‌చుక్ తెలిపారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై ఎలాంటి చర్యలు తీసుకోమని, కేసులు పెట్టబోమని ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీని కోరారు. ప్రభుత్వం నుంచి ఈ హామీలు లభిస్తే నిరాహారదీక్ష విరమిస్తానని చెప్పారు. హామీ లభించకపోతే నిరవధికంగా నిరాహారదీక్ష కొనసాగిస్తానని హెచ్చరించారు.

## మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

(మొదటి పేజీ తరువాయి)

కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడిపిన బైక్ ఢీకొనడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మకు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే వ్యక్తిని కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేశారని, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, అలాగే ప్రమాదానికి సంబంధించిన బైక్‌ను మార్చి ఆధారాలను తారుమారు చేయాలని చూశారన్న అభియోగాలతో అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# న్యాయబద్ధమైన విద్యా వ్యవస్థ కావాలని కోరుతున్నారు

న్యూఢిల్లీ: భారతదేశ విద్యా వ్యవస్థను మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా చట్టబద్ధమైనవని, వాటిపై రాజీ పడటానికి ఆస్కారం లేదని తేల్చిచెప్పారు. విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నీట్--యూజీలో అవకతవకలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ ధర్మేంద్ర ప్రధాన్ ఎందుకు రాజీనామా చేయడం లేదని నిలదీశారు. నిరసనకు దిగిన విద్యార్థులు ఉగ్రవాదులు కాదని.. వారు కేవలం నిష్పక్షపాతమైన విద్యా వ్యవస్థ కావాలని కోరుతున్నారని చెప్పారు. పరీక్షల్లో అక్రమాల వల్ల నష్టపోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులపై దాడికి బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా చేయాలన్నారు. రాహుల్ గాంధీ బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో విద్యా వ్యవస్థ రిగ్గింగ్‌కు గురైందని, అది సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం 'చలో సంసద్' నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాడికి సంబంధించిన వీడియోను రాహుల్ ప్రదర్శించారు. ప్రభుత్వం, పాలకులు భయాందోళనలో ఉన్నారని, అందుకే విద్యార్థులను, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం



మాట్లాడారంటే..

**విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాలి..**

"ప్రధానమంత్రి నివాసం వద్ద మంగళవారం శాంతియుత నిరసనలో పాల్గొన్న నన్ను బలవంతంగా ఈడ్చేశారు. భౌతిక దాడి చేశారు, నిర్బంధించారు. అవన్నీ నేను లెక్కచేయను. అవి చాలా చిన్న విషయాలు. ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేయడమే నా పని. ఇప్పుడున్న విద్యా వ్యవస్థ వల్ల పేదలు ఇబ్బంది పడుతుండగా, ధనవంతులు పేపర్ లీక్‌లతో పరీక్షల్లో ఉత్తీర్ణులవుతున్నారు. ఈ పరిస్థితి కచ్చితంగా మారాలి. విద్యార్థులు లేవనెత్తిన మూడు డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. విద్యార్థులపై దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి. మన విద్యార్థులకు ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే ప్రశ్న. భద్రతా దళాలు వారిపై ఆయుధాలు గురిపెట్టడానికి, దాడి చేయడానికి విద్యార్థులు చేసిన తప్పేంటి? వారు ఈ దేశం తమకు ఇవ్వాల్సిన వాటిని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. న్యాయబద్ధమైన విద్యా వ్యవస్థ కావాలని అంటున్నారు. విద్యా వ్యవస్థలో లోపాల వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతులేని ఒత్తిడికి గురవుతున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా పేరుగాంచిన మన విద్యా వ్యవస్థ నేడు లోపాలమయంగా మారిన సంగతి అందరికీ తెలుసు. గత దశాబ్ద కాలంలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయి. కానీ, ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. విద్యా వ్యవస్థ వైఫల్యం కారణంగా 7.5 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. సమాజంలో ఒక వర్గం వ్యక్తులు మన విద్యా వ్యవస్థను, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారు. మన దేశంలో కుటుంబాలు విద్య కోసం చేసే వార్షిక వ్యయం రూ.1.32 లక్షల కోట్లు. ఇది రూ.1.4 లక్షల కోట్ల విద్యా బడ్జెట్‌కు దాదాపు సమానం. విద్య పేరిట కుటుంబాలను దోచుకుంటున్నారు. దేశంలో తయారీ రంగం మూతపడింది, పరిశ్రమల్లో అవకాశాలు లేవు, కార్పొరేట్ ఉద్యోగాలు లేవు.

### మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..

## భారీగా అభివృద్ధి చేస్తా: మంత్రి లోకేశ్

మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని లోకేశ్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. 2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.

## హస్తం, కమలం శ్రేణుల పోటాపోటీ నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న బీజేపీ శ్రేణులు అడ్డుకోవడంతో పరిస్థితి విషమించింది. ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతోపాటు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఒక టీవీ జర్నలిస్టు, మహిళా కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ విచ్ఛిన్నకర రాజకీయాలు, రాహుల్‌గాంధీ దేశ వ్యతిరేక వైఖరిపై బీజేపీ పోరుబాట చేస్తుందని చెప్పారు. నీట్ పరీక్ష పత్రం లీకేజిపై పార్లమెంటులో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాహుల్ ప్రధాని నివాసం ముట్టడికి దిగడం ఆయన అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనలో అసలు విద్యార్థులే లేరని, కేవలం సామాజిక విద్రోహ, అల్ట్రాలెఫ్ట్ మూకలను జమచేసి ఆందోళనలు చేయిస్తున్నారని ఆరోపించారు.

## సీసీఐపై వైఖరి చెప్పండి

ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంట్ పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తన అధికారిక వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తుకు, వేలాది కుటుంబాల ఉపాధికి కీలకమైన ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు. ఇటీవల జులై 15న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన సమితి సభ్యులతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 250 కోట్లు కేటాయించి, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇది సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన లేకపోవడమే పునరుద్ధరణకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా తాను కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. టీఎస్-ఐపాస్ ద్వారా ప్రోత్సాహకాలు, కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ లేదా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్‌ను నడిపేందుకు సిద్ధమని ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో, సీసీఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి, తన వైఖరిని ప్రజలకు వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**పోలీసు రాజ్యం నడవదు**

ఆందోళనలో భాగంగా మహేశ్‌గౌడ్, మంత్రి పొంగులేటి, విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే దానం నాగేందర్, రోహిణ్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు చేతులకు సంకెళ్లు వేసుకుని ఇందిరమ్మ విగ్రహం ముందు కూర్చుని నిరసన తెలియజేశారు. అనంతరం నెక్లెస్‌రోడ్డులోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు భారీస్థాయిలో చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి లోక్‌భవన్ వైపునకు దూసుకెళ్లే యత్నం చేశారు. అయితే, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. మహేశ్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, టీపీసీసీ నేతలను అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు ఎంఏ ఫయీమ్, మెట్టు సాయికుమార్, నూతి శ్రీకాంత్, దీపక్‌జాన్, జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ నేతలు బండి రమేశ్, నీలం మధు, చనగాని దయాకర్, ఫహీం ఖురేషీ, పిడమర్తి రవితోపాటు పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పొగాకు రైతుల సమస్యలపై గట్టిగా పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

దోచుకుంటున్నారని, ఏ పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదని.. చివరకు ఆక్వా రైతులదీ అదే పరిస్థితి అని గుర్తు చేశారు. సీజన్ ముగుస్తున్నా ఇప్పటికీ పొగాకు కొనుగోళ్లు లేవని, ఇప్పటి వరకు 20 శాతం కొనుగోళ్లు కూడా జరగలేదని చెప్పారు. నెల్లూరు, ప్రకాశం, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో పొగాకు సాగు చేస్తున్న రైతులు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. వారి సమస్యలన్నీ సావధానంగా విన్న జగన్.. నేనున్నానంటూ వారికి భరోసా ఇచ్చారు. రైతులెవ్వరూ ధైర్యం కోల్పోవద్దని, పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటిస్తానని.. పొగాకు రైతులను స్వయగా కలుస్తానని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం నిద్ర నటిస్తోందని.. నిద్ర పోయే వాళ్లను లేపొచ్చు కానీ, నిద్ర నటించే వాళ్లను లేపడం కష్టమని.. అయినా గట్టిగా ప్రయత్నిస్తామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**చంద్రబాబు మాటకు విలువ లేదు**

పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికి దాదాపు 94 రోజులు అయినప్పటికీ, 20 శాతం కూడా కొనుగోలు చేయని పరిస్థితులు రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. మామూలుగా 100 రోజుల్లోనే పొగాకు కొనుగోళ్లు పూర్తి కావాలి. అలాంటిది 94 రోజులు దాటినా కూడా ఇంత వరకు కేవలం 38 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారు. పండిందేమో 232 మిలియన్ కేజీలు. అంటే పండిన పంటలో కేవలం 16.5% మాత్రమే కొనుగోలు చేశారు. ఇలాగైతే రైతు ఏ రకంగా బతకగలుగుతాడు? ఎన్ని రోజులు ఇలా? కర్ణాటకలో సెప్టెంబర్‌లో పొగాకు కొనుగోళ్లు మొదలవుతాయి. అప్పుడు సగం మంది ట్రేడర్లు సహజంగా అటువైపు వెళ్లిపోయే అవకాశం ఉంది. అలాగైతే తమ పంటను ఎవరు కొంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు సమీక్ష చేసి పొగాకు ధర కేజీ రూ.200కు తగ్గకూడదని చెప్పిన మరుసటి రోజే పొదిలిలో రూ.179, టంగుటూరు, కనిగిరిలో రూ.184, కందుకూరులో రూ.186, జంగారెడ్డిగూడెం, గోపాలపురంలో రూ.170తో కొనుగోలు చేశారంటే సిండికేట్ ఏ రకంగా వేళ్లూనుకుందో స్పష్టమవుతోంది. అసలు చంద్రబాబు మాటకు విలువ లేదని తేలిపోయింది.

**పొగాకు బోర్డు లక్ష్యం ఏమిటి?**

రైతులకు మంచి జరగాలనే ఉద్దేశంతో వ్యాపారులను ఒక ప్లాట్‌ఫామ్ మీదకి తీసుకొచ్చి, పోటీ వాతావరణం ఏర్పడేలా చేస్తే రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో టుబాకో (పొగాకు) బోర్డు ఏర్పాటైంది. చంద్రబాబు ప్రభుత్వ పుణ్యాన పరిస్థితి ఎలా మారిందంటే.. ఆయన అధికారంలోకి వస్తూనే సిండికేట్‌లో అందరికీ కొమ్ములు వస్తాయి. అంతా ఏకమై ధర తగ్గించేస్తారు. చంద్రబాబు చెప్పేది చెబుతూ ఉంటాడు.. మనం చేసేది మనం చేస్తుంటాం అన్న ధైర్యంతో వారుంటారు. ఈ ఒక్క పంటే కాదు. ఏ పంట పరిస్థితి చూసినా ఇంతే. దళారీలే వ్యవస్థను నడుపుతున్నారు.




# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

- వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం
- రఘునాథపురంలో రైతులకు అవగాహన కల్పించిన ఇన్‌చార్జి ఏడీఏ పద్మజ

**తొలివెలుగు, రాజాపేట :** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఏడీఏ, రాజాపేట ఏవో పద్మజ సూచించారు. మంగళవారం రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామపంచాయతీ వద్ద రైతులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పప్పుదినుసులు, మునగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులతో పాటు రైతులకు మంచి ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను సాగు చేయడం ఉత్తమమని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల భూమి సారం పెరగడంతో పాటు వ్యవసాయ వ్యయాలు కూడా తగ్గుతాయని తెలిపారు. పప్పుదినుసుల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించి, వాటి సాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు అడిగిన పలు సందేహాలకు ఇన్‌చార్జి ఏడీఏ పద్మజ సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు మానుకుని ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన పీఏసీఎస్ చైర్మన్ మహేందర్ గౌడ్
- ఆలేరులో కాంగ్రెస్ నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు



**తొలివెలుగు, రాజాపేట:** ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని రేణిగుంట పీఏసీఎస్ చైర్మన్ నేమిళ్ల మహేందర్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. బుధవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్షలో మహేందర్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి భయపడిన కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తూ ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రజా సమస్యలు, న్యాయపరమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజాపేట మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బియ్యం పంపిణీ

- బేగంపేటలో రెండు కుటుంబాలకు ఉపసర్పంచ్ ఆర్థిక భరోసా

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన నాగారం కిష్టయ్య, బిచ్చల అశోక్ కుటుంబాలకు గ్రామ ఉపసర్పంచ్ బద్ధం మధుసూదన్ రెడ్డి అండగా నిలిచారు. బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చిన మధుసూదన్ రెడ్డి, కష్టకాలంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బోగ హరినాథ్, పంబ కరుణాకర్, దేవి సుధాకర్, నీల బాలకృష్ణ, దూసరి అంజయ్య, నాగారం రామచంద్రం, బిచ్చల నరసింహులు, ఆకుల నరసింహులు, కాసుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# యదాద్రిలో వైభవంగా గిరిప్రదక్షిణ

- స్వాతి నక్షత్రం సందర్భంగా కొండచుట్టూ ప్రదక్షిణలు చేసిన
- పారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఈవో భవానీ శంకర్

**యాదగిరిగుట్ట, జూలై 22 (తొలి వెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా బుధవారం కొండచుట్టూ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) భవాని శంకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కలిసి ప్రారంభించారు. ముందుగా వైకుంఠ ద్వారం సమీపంలోని స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. అనంతరం వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. "జై నారసింహా... జయ జయ నారసింహా" అంటూ నామస్మరణలు చేస్తూ, భజనలు, సంకీర్తనలు ఆలపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రతిరోజూ నిర్వహించే గిరి ప్రదక్షిణకు భక్తులు హాజరవుతుండగా, స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి రోజు, ఏకాదశి పర్వదినాల్లో ప్రత్యేకంగా భారీ స్పందన లభిస్తోందని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమకు స్వామివారి అనుగ్రహంతో కలిగిన ఆధ్యాత్మిక అనుభూతులను ఇతరులతో పంచుకున్నారు. పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి పారవశ్యంతో గిరి ప్రదక్షిణ పూర్తి చేయడం విశేషంగా నిలిచింది.

# కాలువలకు నీళ్లు విడుదల చేయాలి

- రాజాపేటలో బీఆర్ఎస్ పాదయాత్ర.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల రైతులకు సాగునీరు అందించి కాలువల ద్వారా చెరువులను నింపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం రాజాపేట మండలంలో పాదయాత్ర నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పాదయాత్రకు ముందు రాజాపేట మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బేగంపేట వాగు వద్ద రైతుల సమస్యలను వివరిస్తూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కల్లూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాజాపేట మండలానికి కాలువల ద్వారా సాగునీరు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి ఎత్తిపోతలను పునఃప్రారంభించి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేయాలని, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, కొండపోచమ్మ, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి కాలువల ద్వారా ఆలేరు





నియోజకవర్గంలోని చెరువులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రైతుల తరపున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి కన్వీనర్ ఎర్రకోకుల జస్వంత్, రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు గుంటి మసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగర్తి గోపాల్ రెడ్డి, జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్య, మదర్ డైరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటాంరెడ్డి, పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో ఆర్టిజన్‌ల ఉద్యమాన్ని అణచలేరు

- హామీలు అమలు చేయాలని విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల డిమాండ్
- హైదరాబాద్ మహాధర్నాలో పాల్గొన్న భువనగిరి డివిజన్ నాయకులు





**తొలివెలుగు, రాజాపేట:** అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల ఉద్యమాన్ని అణచివేయలేరని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ భువనగిరి డివిజన్ చైర్మన్ ఇంజి మహేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో టీజీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది రోజుల సమ్మె అనంతరం న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా మూడు నెలలు గడిచినా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. సమ్మె సమయంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు ముందు పలువురు ఆర్టిజన్ కార్మికులను గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం స్పందించకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డివిజన్ కన్వీనర్ బొట్ల రమేష్, కో-కన్వీనర్లు ఎడ్ల వెంకటేష్, హరికృష్ణ, డి. భాస్కర్, దేశపాండే భరత్, సందీప్‌తో పాటు పలువురు ఆర్టిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# భూములన్నీ స్పష్టమైన హద్దులతో సర్వే

- లక్ష్మక్కపల్లి, బూరుగుపల్లిలో 'భూ భారతి' అవగాహన సదస్సులు
- రీ-సర్వేపై రైతుల సందేహాలకు సమాధానాలిచ్చిన తహసీల్దార్ రవికిరణ్

**తొలివెలుగు, రాజాపేట:** గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములతో పాటు చెరువులు, కుంటలు, పట్టా భూములన్నింటినీ స్పష్టమైన హద్దులతో సర్వే చేయనున్నట్లు రాజాపేట తహసీల్దార్ రవికిరణ్ తెలిపారు. బుధవారం మండలంలోని లక్ష్మక్కపల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన 'భూ భారతి – భూ సర్వే అవగాహన సదస్సు'లో ఆయన పాల్గొని రైతులకు రీ-సర్వే ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ భారతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములను శాస్త్రీయ పద్ధతిలో కొలతలు నిర్వహించి స్పష్టమైన సరిహద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియతో భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులు అడిగిన పలు ప్రశ్నలకు తహసీల్దార్ రవికిరణ్ స్పష్టమైన సమాధానాలు ఇస్తూ రీ-సర్వే విధానం, హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు ఇండ్ల రాజయ్య, చింతల సంపత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాసోజు సంపత్‌కు సన్మానం

- నియామకంపై అభినందనలు తెలిపిన పార్టీ నాయకులు

**తొలివెలుగు, రాజాపేట:** భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజాపేట మండల కేంద్రానికి చెందిన కాసోజు సంపత్ నియమితులైన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కాసోజు సంపత్ మరింత కృషి చేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఆయనకు లభించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ కోయ మధు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, జిల్లా, మండల, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజాపేటలో మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం

- బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసిన బీజేపీ శ్రేణులు



**తొలివెలుగు, రాజాపేట:** భారతీయ జనతా పార్టీ రాజాపేట మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాజాపేటలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రమేష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై దాడికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారంటూ ఆరోపిస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా తగిన విధంగా స్పందిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు దాచేపల్లి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాసోజు సంపత్, రేణిగుంట మాజీ ఉపసర్పంచ్ బూర్గు శేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్‌రెడ్డి, రాజాపేట పట్టణ అధ్యక్షుడు సాధనబోయిన శంకర్, బిర్రు సురేష్, సోమసాని చంద్రమోహన్, రంగ నరేష్, గొడుగు గణేష్, ఐరేణి శ్రీధర్, మెండు మణికుమార్‌రెడ్డి, పెంట నాగరాజు, రంగ రామగౌడ్, ఎండీ కాజా, గాజా ప్రకాశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం మానవతా సహాయం
- కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల ఫ్లవర్ డెకరేషన్ అసోసియేషన్ సభ్యుడు ఎలగందుల సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అండగా నిలిచింది. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన సంఘం ప్రతినిధులు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి నాయకత్వం వహించారు. ముందుగా మృతుడు ఎలగందుల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చెక్క మల్లేష్, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, గౌరవ సలహాదారులు రచ్చ వినోద్, మాజీ అధ్యక్షులు దోర్నాల గణేష్, గుడ్డేటి పాండు, కార్యవర్గ సభ్యులు విఘ్నేష్, పొట్టబత్తిని కృష్ణ, సభ్యులు గోదాసు సత్యనారాయణ, ఒంటెద్దు ఎల్లయ్య, దోర్నాల సదానందం, పెండం బాల లింగం, పెరమండ్ల అశోక్, ఎరవాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ లైంగికదాడి

శంషాబాద్ రూరల్, జూలై 22: ఇండిగో ఎయిర్‌లైన్స్ ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థలో క్యాబిన్ క్రూగా ఉద్యోగం చేస్తున్న బాధితురాలిని ప్రతిరోజు క్యాబ్ డ్రైవర్ ప్రశాంత్‌కుమార్ తీసుకుపోయేవాడు. ఈనెల 20న మధ్యాహ్నం సమయంలో బాధితురాలిని శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టుకు క్యాబ్‌లో తీసుకుపోతున్న ప్రశాంత్‌కుమార్ మెయిన్‌రోడ్డు బంద్ ఉందని చెప్పి ఎయిర్‌పోర్టులోని నిర్మాణంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుపోయి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో అక్కడినుంచి పారిపోయాడు.

# విద్యార్థులపై దాడులకు నిరసనగా మోదీ దిష్టిబొమ్మ దహనం





- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ: పున్న జగన్మోహన్

**తొలివెలుగు, రామన్నపేట:** ఢిల్లీలో విద్యార్థుల నిరసన కార్యక్రమాల సందర్భంగా పోలీసుల చర్యలను నిరసిస్తూ రామన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ నాయకత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పున్న జగన్మోహన్ మాట్లాడుతూ.. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన "చలో పీఎం హౌస్" పిలుపునకు స్పందించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై కూడా దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడిని కుట్రపూరిత చర్యగా అభివర్ణించిన ఆయన, దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై ఇలాంటి చర్యలు తగవని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థులపై జరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, ఉపసర్పంచ్ మోటే రమేష్, జింకల ప్రభాకర్, సాల్వేరు అశోక్, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, మొహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, మోటే మహేష్, మొహమ్మద్ అంజాత్, వెంకటేష్, మీర్జా అసలం బేగ్, కొమ్ము నాగరాజు, నోముల ప్రవీణ్ కుమార్, మొహమ్మద్ రిజ్వాన్, లెంకల ప్రవీణ్, మొహమ్మద్ అజార్, బండ అంజిరెడ్డి, కొండ శేఖర్ గౌడ్, గడ్డం యాదగిరి, మీర్జా ఇనాయతుల్లా బేగ్, చింతల కృష్ణ, స్వామి దామోదర్ రెడ్డి, సాయి, ఎండీ సమీర్, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

- ఖైతాపురంలో 'భూభారతి-భూసర్వే' అవగాహన సదస్సు - రైతులు సర్వే బృందాలకు సహకరించాలని అధికారుల పిలుపు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూభారతి – భూసర్వే, భూ రీసర్వే' కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎల్మ రామలింగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రైతులకు రీసర్వే ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. డ్రోన్లు, శాటిలైట్ సాంకేతికతతో గ్రామంలోని భూములకు ఖచ్చితమైన సరిహద్దులు నిర్ధారించి, భూ రికార్డులను డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు భూముల హద్దులు స్పష్టమవుతాయని పేర్కొన్నారు. రైతులు, భూ యజమానులు సర్వే బృందాలకు పూర్తిస్థాయిలో సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన పత్రాలు, వివరాలు అందించాలని అధికారులు కోరారు. భూ రీసర్వే ప్రక్రియపై రైతులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహసీల్దార్ వీరబాయి, సర్వే డీఐ, పంచాయతీరాజ్ ఏఈ, రెవెన్యూ ఆర్ఐ, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ఏఈఓ, జీపీఓ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానికులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారసుతో లబ్ధిదారులకు ఆర్థిక సాయం

**తొలివెలుగు, చౌటుప్పల్:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను దండు మల్కాపూర్ గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారసుతో మంజూరైన ఈ చెక్కులను గ్రామశాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు సుక్క రవీందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోయిని స్వరూపకు రూ.56 వేల, జోన్నగంటి జంగయ్యకు రూ.45 వేల, పేరుమాండ్ల అచ్చమ్మకు రూ.35 వేల, బుర్ర దేవికి రూ.17 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం లబ్ధిదారులకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీసాల నర్సింహ్మ, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ మహ్మద్ గౌస్ ఖాన్, వార్డు సభ్యులు ఈడ్డుల ఇంద్రసేన యాదవ్, అత్తపురం సంతోష్ అంజిరెడ్డి, మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు మునుకుంట్ల రాజు గౌడ్, దేవాలయ ధర్మకర్తలు ఈడ్డుల బాబు యాదవ్, దౌడి లింగస్వామి, కాంగ్రెస్ నాయకులు పీసరి యాదిరెడ్డి, మల్కాజిగిరి నరసింహ, దౌడి వెంకటేష్, ఈడ్డుల కేశవ్ యాదవ్, బద్దుల నర్సింహ్మ, ముదిగొండ మహేష్, బుర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నీట్ అక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- జులై 24 విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి: ఎస్ఎఫ్ఐ
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై వేముల నాగరాజు విమర్శలు

**తొలివెలుగు, రామన్నపేట:** నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాల వల్ల ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవినీతి ఆరోపణలతో జాతీయ పరీక్షల వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసం దెబ్బతిన్నదని విమర్శించారు. నీట్ అక్రమాలపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌టీఏను రద్దు చేసి విద్యా కేంద్రీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా చేపడుతున్న నిరసనలపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం ఖండనీయమని, నిరసన తెలిపే హక్కును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జులై 24న ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపును విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని వేముల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత, నాయకులు అప్పం అభిరూప్, నవదీప్, మానస, ఉమారేఖ, సంతోషం, శివాని తదితరులు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాల దొంగలు అరెస్ట్

హైదరాబాద్ బంజారాహిల్స్ పరిధిలో పనిచేసే కంపెనీకే కన్నం వేసి కిలోకు పైగా బంగారాన్ని కాజేసిన ఇద్దరిని నగర కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ బృందం, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కర్ణాటకకు చెందిన సున్ కాంబ్లే హరీశ్ గురుకృప ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగబాధ్యతల్లో భాగంగా అతడు కృష్ణ పెరల్స్, శ్రీ జువెల్లర్స్, అపర్ణ జువెల్లర్స్, జోయలుక్కాస్, మానేపల్లి జువెల్లర్స్ వంటి ప్రముఖ రిటైల్ జ్యువెలరీ షాపులను సందర్శించేవాడు. వారికి నూతన డైమండ్, గోల్డ్ డిజైన్లను చూపిస్తూ ఆర్డర్లు తీసుకుని డెలివరీ చేసేవాడు. అనంతరం వారి నుంచి చెక్కులు సేకరించి ఆఫీసులో సమర్పించేవాడు. ఈ క్రమంలో కంపెనీకి చెందిన బంగారు ఆభరణాలను లాకర్‌లో భద్రపరచడం హరీశ్ గమనించాడు. తన ఆర్థిక ఇబ్బందుల వల్ల, వ్యక్తిగత అవసరాల కోసం కంపెనీలోని బంగారం దొంగిలించాలని పథకం వేశాడు. ఇందుకోసం హైటెక్ సిటీలో పనిచేసే తన సోదరుడు ఆకాశ్‌ను భాగస్వామిగా చేసుకున్నాడు. జూలై 16న ఆఫీసు వద్ద రెక్కీ నిర్వహించి చోరీకి విఫలయత్నం చేశారు. మర్నాడు రాత్రి ఇద్దరూ ఆఫీసుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, బాత్‌రూమ్ గ్రిల్స్ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించాడు. లాకర్ తెరిచి అందులో ఉన్న 1.028 కిలోల బంగారు ఆభరణాలను




ఎత్తుకెళ్లారు. అనంతరం ఆ ఆభరణాలను తన సోదరుడు ఆకాశ్‌కు ఇవ్వగా దాచిపెట్టాడు. నేరం చేసే సమయంలో నిందితులు తమను కనిపెట్టకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు డీసీపీ వివరించారు. కంపెనీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌తోపాటు కొన్ని సాంకేతిక ఆధారాలతో నిందితులను మంగళ్‌హట్‌లో పట్టుకున్నారు. వారి నుంచి చోరీకి గురైన మొత్తం 1.028 కిలోల బంగారం(7 గొలుసులు, 7 జతల కమ్మలు)ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ అరెస్ట్‌లో టాస్క్‌ఫోర్స్ జూబ్లీహిల్స్ జోన్ ఇన్‌స్పెక్టర్ ఛత్రాసింగ్ యాదేందర్, ఎస్ఐ మహ్మద్‌జాహెద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాస్తులు రూ.400కోట్లు

హైదరాబాద్: అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు కొనసాగిస్తోంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో బుధవారం తెలంగాణ పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ (రెడ్కో) డివిజినల్ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకట రమణ నివాసం, కార్యాలయం, బంధువుల ఇళ్లు సహా 7 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. భారీగా నగదు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకుంది. మార్కెట్‌లో అక్రమాస్తుల విలువ రూ.400 కోట్లుగా తేలింది. ఏసీబీ చరిత్రలోనే అతిపెద్ద కేసుగా ఇది రికార్డు సృష్టించింది. ఏసీబీ లెక్కల ప్రకారం ఇప్పటివరకు నమోదైన కేసుల్లో ఈఎస్ఐ మందుల సరఫరా కుంభకోణంలో 2019లో అరెస్టు అయిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మాజీ డైరెక్టర్ దేవికారాణి అక్రమాస్తులే ఇప్పటికీ ప్రథమ స్థానంలో ఉన్నాయి. ఈమె నుంచి స్వాధీనం చేసుకున్న వాటి మొత్తం విలువ అధికారిక లెక్కల ప్రకారం రూ.25,70,84,461గా తేల్చారు. దీన్ని తలదన్నుతూ వెంకట రమణ నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తులను రూ.27,65,02,133గా ఏసీబీ లెక్కకట్టింది. వీటి మార్కెట్ విలువ రూ.400 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వెంకట రమణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ సిటీ రేంజ్--2 డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ ప్రాథమిక దర్యాప్తులో కొందరు బినామీలను గుర్తించారు. 2019లోనూ వెంకట రమణ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. సాధారణంగా అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కనిపించే రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఎక్సైజ్, పోలీసు విభాగాలను మించి ఐఎంఎస్, విద్యుత్ శాఖల అధికారులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఈ సోదాల్లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలోని నాలుగు ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలు (విలువ రూ.1,23,46,000), కూకట్‌పల్లి అంజనేయ నగర్‌లో 160 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న జీ౦3 వాణిజ్య భవనం (విలువ రూ.1,82,00,000), గుట్టల బేగంపేట్‌లో 250 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న జీ౦5 వాణిజ్య భవనానికి (విలువ రూ.2,90,03,550) సంబంధించిన పత్రాలు లభించాయి. వీటికి అదనంగా తన భార్య పేరుతో నమోదై ఉన్న నాలుగు నిర్మాణ సంస్థల ద్వారా నిర్మాణ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు విచారణలో తేలింది. అంజనేయ నగర్, మూసాపేట, కూకట్‌పల్లిలో 10 అపార్ట్‌మెంట్లు నిర్మించగా, వాటి నిర్మాణ వ్యయం సుమారు రూ.20 కోట్లుగా ఏసీబీ అధికారులు అంచనా వేశారు. వీటికి తోడు రూ.52,02,585 బ్యాంక్ బ్యాలెన్స్, 2.09 కేజీల బంగారు ఆభరణాలు, కియా, మహీంద్రా, బలెనో కార్లు (విలువ రూ.45 లక్షలు), రూ.30 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రూ.2.5 లక్షల విలువైన 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మరిన్ని ఆస్తులపై విచారణ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. వెంకట రమణ గతంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేశారు. సైబర్‌సిటీ సర్కిల్‌లో డివిజనల్ ఇంజినీర్‌గా (టెక్నికల్) పనిచేస్తున్న సమయంలో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. 2019 డిసెంబర్ 12న ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఫైనల్ ఎస్టిమేట్ ఆమోదం కోసం రూ.25 వేల లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కారు. ఆ మర్నాడు వెంకట రమణను అరెస్టు చేశారు. ఆయన కొద్దిరోజులు జైల్లో గడిపాడు. అప్పట్లో చేసిన సోదాల్లో ఏసీబీ అధికారులు రూ.26.52 లక్షల నగదు, రూ.22,60,565 విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటితో కలిపి వెంకట రమణ మొత్తం ఆస్తుల విలువను రూ.28,14,14,700గా ఏసీబీ తేల్చింది.



# ఈడ్చుకెళ్లి... గొంతుకోసి..

చిలకలగూడ (హైదరాబాద్): ఆస్తి తగాదాల నేపథ్యంలో ఒంటరిగా ఉంటున్న అత్తపై కూరగాయలు కోసే కత్తితో కోడలు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... చిలకలగూడ ఎరుకలబస్తీకి చెందిన దేవరాయ పద్మావతి (57)కి కోడలు విజయలక్ష్మికి మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి పంపకాల విషయంలో మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ ఇరువురి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. పద్మావతి భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందారు. మొదటి అంతస్తులో అత్త పద్మావతి ఒంటరిగా ఉండగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో కుమారుడు, కోడలు విజయలక్ష్మి ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఫస్ట్‌ఫ్లోర్‌ను కుమార్తెకి రాసిస్తానని పద్మావతి చెప్పడంతో నాలుగేళ్లుగా అత్తాకోడళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీన వివాదం తీవ్రమై అత్తను ఇంట్లోకి ఈడ్చుకెళ్లిన కోడలు కూరగాయలు కోసే కత్తితో ఆమె గొంతు, చేతులపై దాడి చేసింది. పద్మావతి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని రక్తపుమడుగులో పడున్న ఆమెను హుటాహుటిన గాంధీఆస్పత్రికి తరలించారు. కోడలు అత్తపై దాడి చేస్తున్న దృశ్యాలు ఇంట్లోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విజయలక్ష్మిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వైద్యసేవల అనంతరం అత్త పద్మావతి కోలుకుంటున్నారు. ప్రాణాపాయం లేదని వైద్యులు స్పష్టం చేశారు. బ్యాటరీతో ప్రయోగం చేస్తూ బాలుడు మృతిచెందిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నికాడి గణేశ్, శారద దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు లోకేశ్ (14) స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవా రం ఉదయం తండ్రి వ్యవసాయ పనులకు వెళ్లగా, తల్లి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. పాఠశాలకు వెళ్లకుండా ఉదయం 10గంటలకు లోకేశ్ ఇంట్లోని బ్యాటరీతో ప్ర యోగాలు చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. బాలుడి ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి నోటితోపాటు దవడలు ఛిద్ర మై తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటనాస్థలిని కౌటాల సీఐ సంతోష్ కుమార్, చింతలమానెపల్లి ఎస్సై కమలాకర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. లోకేశ్‌కు చిన్నతనం నుంచే బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వైర్లతో ప్ర యోగాలు చేసే అలవాటు ఉంది. ఇంట్లోని సైకిల్‌కు లైట్లను అమర్చడం, బ్యాటరీతో అనుసంధానించడం వంటి పనులు చేస్తుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

- ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన
- జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచన
- చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ, చౌటుప్పల్ డివిజన్ ట్రాఫిక్ డీఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ నారాయణపురం ఎక్స్‌రోడ్ వద్ద ఆటో యూనియన్ డ్రైవర్లు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే చౌటుప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తూప్రాన్‌పేట గురుకుల విద్యాసంస్థ విద్యార్థులకు రోడ్డు భద్రత, సురక్షిత డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రస్తుతం చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ట్రాఫిక్ మళ్లింపులు, హెచ్చరిక బోర్డులు, పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సహనంతో ప్రయాణించాలని కోరారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ మాట్లాడుతూ.. "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉంది. ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని




పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ సభ్యులు, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, గురుకుల విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






# ఘనంగా దాశరధి జయంతి వేడుకలు

- మహాకవికి ఘన నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నాయకులు
- "బొగ్గు ముక్కలే కలం.. గోడలే కాగితాలు" అంటూ దాశరధి సేవలను స్మరణ

**తొలివెలుగు, చిన్నగూడూరు:** చిన్నగూడూరు మండల కేంద్రంలోని దాశరధి సెంటర్‌లో మహాకవి దాశరధి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు చెక్కల శ్రీను, వార్డు సభ్యుడు గంగాధరి అనిల్ దాశరధి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "బొగ్గు ముక్కలే కలం.. గోడలే కాగితాలు" అంటూ జైలు గోడలపై విప్లవ కవిత్వాన్ని రాసిన మహాకవి దాశరధి సాహిత్యం తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ఉద్యమంలో పాల్గొన్న దాశరధి 1947 ఏప్రిల్ 16న అరెస్టై వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించబడ్డారని గుర్తు చేశారు. జైలులో కాగితం, కలం లేకపోయినా బొగ్గు ముక్కలతో గోడలపై కవితలు రాసిన ఆయన రచనలు తర్వాత 'అగ్నిధార', 'రుద్రవీణ' వంటి మహోన్నత సాహిత్య సంపదకు పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ తెలంగాణ ఆత్మను ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి దాశరధి కృష్ణమాచార్యులు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు అంబరీష్, సుమన్, యువ నాయకులు హబీబ్, యాకన్న, ఉపేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కిరాణా షాపులో అక్రమ మద్యం ధందా.. వ్యాపారిపై కేసు

- పెద్ద కొండూరులో పోలీసుల మెరుపు దాడులు
- భారీగా విస్కీ, బీరు సీసాలు స్వాధీనం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామంలో కిరాణా షాపు ముసుగులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. చౌటుప్పల్ సీఐ జి. మన్మథ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొండూరుకు



చెందిన కూడబోయిన లాలూ ప్రసాద్ (34) తన కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హెచ్‌సీ వి. శ్రీనివాస్, ఏఆర్‌పీసీ సైదులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 65 విస్కీ బాటిళ్లు, 25 బీరు సీసాలు కలిపి మొత్తం 90 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత



- ఎంజేపీటీ పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల అవగాహన
- నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ: సీఐ మన్మధ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎంజేపీటీ పాఠశాలలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రాణాంతకమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. అలాగే జీబ్రా క్రాసింగ్ ద్వారానే రోడ్డు దాటాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


# పసిడి ధరకు మళ్లీ రెక్కలు..

**రూ.1.50 లక్షలకు చేరువలో తులం రేటు**


న్యూఢిల్లీ, జూలై 22 : బంగారం ధరలు మళ్లీ రెక్కలు తొడుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఒక్కసారిగా డిమాండ్ నెలకొనడం, దేశీయంగా కొనుగోళ్లు పెరుగడంతో బంగారం విలువ రూ.1.50 లక్షలకు చేరువైంది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,900 ఎగబాకి రెండు వారాల గరిష్ఠ స్థాయి రూ.1,49,600కి చేరుకున్నట్టు ట్రేడర్లు తెలిపారు. అంతకుముందు రూ.1, 47,700గా ఉన్నది. ఈ నెల 7న గోల్డ్ ధర రూ.1,49, 250 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి.

**వెండి పరుగులు**

గత ఆరు రోజులుగా తగ్గుతూ వచ్చిన కిలో వెండి ఏకంగా రూ.8,500 ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. గత సెషన్‌లో వెండి రూ.2,21,500గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి భారీగా పుంజుకున్నదని ట్రేడర్లు వెల్లడించారు. రూపాయి పతనం కావడం కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ మెరుగుపడిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 47.43 డాలర్లు లేదా 1.16 శాతం ఎగబాకి 4,125.24 డాలర్లకు చేరుకోగా, వెండి 59.42 డాలర్లు పలికింది. వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను పెంచే అవకాశాలను పరిశీలించనున్నట్టు అమెరికా ఫెడరల్ రిజర్వు ప్రకటించడంతో మదుపర్లలో ఉత్సాహాన్ని నింపింది.



# మార్కెట్‌కు చమురు సెగ




ముంబై: ముడిచమురు ధరలు పరుగులు తీయడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడో రోజూ నష్టపోయింది. బ్యాంకు షేర్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో బుధవారం సెన్సెక్స్ 715 పాయింట్లు కోల్పోయి 76,755 వద్ద నిలిచింది. నిఫ్టీ 191 పాయింట్లు పతనమై 24,000 స్థాయి దిగువన 23,996 వద్ద స్థిరపడింది. దలాల్ స్ట్రీట్ ఒక శాతం పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.25 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం మార్కెట్ క్యాప్ రూ.480 లక్షల కోట్లకు దిగివచ్చింది. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయమే బలహీనంగా ప్రారంభమయ్యాయి. ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. సూచీలు ఏ దశలో కోలుకోలేక, రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒకానొక దశలోనూ సెన్సెక్స్ 829 పాయింట్లు క్షీణించి 76,641 వద్ద, నిఫ్టీ 226 పాయింట్లు కుప్పకూలి 23,961 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి. ఎర్రసముద్రంలో సౌదీ చమురు ట్యాంకర్లపై హౌతీల ముప్పు తీవ్రమవడం, హార్మూజ్ జలసంధిలో సరఫరా అడ్డంకులు తలెత్తడంతో ముడిచమురు (బ్రెంట్ క్రూడ్) ధర బ్యారెల్‌కు 92 డాలర్లపైకి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జెనరిక్ మందుల దిగుమతులపై దశలవారీగా 200% వరకు సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తామని ప్రకటించారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించకపోగా, ఈ ఏడాది పెంచే అవకాశం ఉందన్న అంచనాలు బలపడ్డాయి. పదేళ్ల కాలపరిమితి కలిగి బాండ్లపై రాబడులు 4.63 శాతానికి పెరిగాయి. గత నాలుగు రోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) రూ. 6,000 కోట్లకు పైగా విలువైన భారతీయ షేర్లను విక్రయించారు. ఈ పరిణామాలన్నీ, దేశీయ స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడి పెంచాయి.




## పంజాబ్ నేషనల్ బ్యాంక్ ట్రిపుల్ ధమాకా!

న్యూఢిల్లీ: స్టాండెలోన్ ప్రాతిపదికన ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) నికర లాభం మూడు రెట్లు వృద్ధి చెంది రూ. 5,253 కోట్లకు చేరింది. ట్యాక్స్ చెల్లింపుల భారం తగ్గడం ఇందుకు దోహదపడింది. క్రితం క్యూ1లో బ్యాంకు రూ. 1,675 కోట్ల నికర లాభం నమోదు చేసింది. కొత్త ట్యాక్స్ విధానానికి మళ్లడంతో పన్ను భారం రూ. 3,358 కోట్ల మేర తగ్గినట్లు బ్యాంకు ఎండీ అశోక్ చంద్ర తెలిపారు. దీనితో తొలి త్రైమాసికానికి సంబంధించి అత్యధికంగా రూ. 5 వేల కోట్ల పైగా లాభం సాధ్యపడినట్లు వివరించారు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం పెద్దగా మార్పు లేకుండా రూ. 37,231 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ ఆదాయం రూ. 10,578 కోట్ల నుంచి రెండు శాతం వృద్ధితో రూ. 10,798 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకు ఎఫ్‌సీఎన్ఆర్ (బి) డిపాజిట్లు 425 మిలియన్ డాలర్లు సమీకరించగా, సెప్టెంబర్ 30 ఆఖరు నాటి వరకు 2.5 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చంద్ర వివరించారు. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) రూ. 42,673 కోట్ల నుంచి రూ. 35,381 కోట్లకు, నికర నిరర్థక ఆస్తులు (ఎన్ఎన్‌పీఏ) రూ. 4,132 కోట్ల నుంచి రూ. 3,433 కోట్లకు నెమ్మదించాయి.

## నష్టాల్లో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ముడిచమురు రేట్లు భారీగా పెరిగినప్పటికీ దేశీయంగా ఆ స్థాయిలో పెరగకపోవడంతో ప్రభుత్వ రంగ ఇంధన మార్కెటింగ్ దిగ్గజాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నష్టాలు చవిచూశాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) 15 త్రైమాసికాల్లోనే తొలిసారిగా నష్టాలు నమోదు చేసింది. క్యూ1లో రూ. 3,962 కోట్ల నష్టం ప్రకటించింది. గతేడాది ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ. 6,124 కోట్లు, ఈ ఏడాది జనవరి--మార్చి త్రైమాసికంలో రూ. 3,191 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. తొలి త్రైమాసికంలో ఆదాయం రూ. 1.35 లక్షల కోట్ల నుంచి రూ. 1.59 లక్షల కోట్లకు పెరిగింది. మరోవైపు హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) రూ. 12,265 కోట్ల నష్టం (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. గత క్యూ1లో కంపెనీ రూ. 4,111 కోట్ల లాభం నమోదు చేసింది. తాజాగా ఆదాయం 21 శాతం పెరిగి రూ. 1.45 లక్షల కోట్లకు ఎగిసింది. క్యూ1లో ఎల్‌పీజీపై బీపీసీఎల్ రూ. 3,485 కోట్లు, హెచ్‌పీసీఎల్ రూ. 3,607 కోట్ల మేర ఆదాయం నష్టపోయాయి.




# స్పోర్ట్స్





## అఫ్గానిస్తాన్ కొత్త కెప్టెన్‌గా స్టార్ ప్లేయర్..

అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. తమ వన్డే,టెస్ట్ జట్టు కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ రహమత్ షాను ఏసీబీ నియమించింది. సుదీర్ఘకాలం కెప్టెన్‌గా వ్యవహరించిన హష్మతుల్లా షాహిదీ స్థానాన్ని 33 ఏళ్ల రహమత్ షా భర్తీ చేయనున్నాడు. అదేవిధంగా టెస్ట్, వన్డేల్లో రహమత్ డిప్యూటీగా స్టార్ వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ ఎంపికయ్యాడు. కాగా రహమత్ షా 2021 నుంచి అఫ్గానిస్తాన్ జట్టు వైస్ కెప్టెన్‌గా సేవలందిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడికి ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని జట్టు పగ్గాలను అఫ్గాన్ క్రికెట్ అప్పగించింది. "రహమత్ అపారమైన అనుభవం ఉంది. అతడు జట్టును సమర్ధవంతంగా నడిపించగలడని భావిస్తున్నాం. కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న రహమత్ షా, గుర్బాజ్‌లకు శుభాకాంక్షలు" అని ఏసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఐర్లాండ్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ నుంచి కెప్టెన్‌గా రహమత్ తన ప్రయాణాన్ని మొదలు పెట్టనున్నాడు. ఇక హష్మతుల్లా షాహిదీ విషయానికి వస్తే.. కెప్టెన్‌గా అఫ్గానిస్తాన్‌కు అద్భుతమైన విజయాలు అందించాడు. అతడి నాయకత్వంలోని అఫ్గాన్ 2023 వన్డే ప్రపంచకప్‌లో సంచలనాలు సృష్టించింది. ఆ టోర్నీలో ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను ఓడించి అఫ్గాన్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మొత్తంగా అతడి కెప్టెన్సీలో అఫ్గాన్ జట్టు 55 వన్డేలు ఆడగా, అందులో 27 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అఫ్గాన్ టీ20 జట్టుకు రషీద్ ఖాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

# భారత్ X జింబాబ్వే

**నేడు తొలి టి20**

**శ్రేయస్ సారథ్యంలో బోణీ కోసం నిరీక్షణ**

**సా. గం. 4:30 నుంచి యునైట్8 స్పోర్ట్స్, ఫ్యాన్ కోడ్ యాప్‌లో ప్రసారం**




హరారే: ఐర్లాండ్--ఇంగ్లండ్ పర్యటనలో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన భారత క్రికెట్ జట్టు... మరో టి20 పోరుకు సిద్ధమైంది. నేటి నుంచి జింబాబ్వేతో టీమిండియా మూడు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. శ్రేయస్ అయ్యర్ భారత టి20 జట్టు పగ్గాలు అందుకున్న తర్వాత ఒక్క మ్యాచ్‌లో కూడా విజయం సాధించలేకపోయిన టీమిండియా... ఈ సిరీస్‌లో ఎలాంటి ఆటతీరు కనబరుస్తుందో చూడాలి. సంజూ సామ్సన్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంతో మూడు మ్యాచ్‌ల్లోనూ అభిషేక్ శర్మతో కలిసి 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో మూడు మ్యాచ్‌లు ఆడిన వైభవ్ 14, 13, 15 పరుగులు మాత్రమే చేశాడు. ఐపీఎల్‌లో దంచి కొట్టిన వైభవ్... జింబాబ్వేతో సిరీస్‌లో అయినా చెలరేగుతాడా చూడాలి. అండర్--19 ప్రపంచకప్ ఫైనల్లో ఇదే మైదానంలో భారీ సెంచరీ బాదిన వైభవ్ సీనియర్ స్థాయిలో రాణించాల్సిన అవసరముంది. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబేతో మిడిలార్డర్ పటిష్టంగా ఉంది. అయితే వీరంతా సమష్టిగా రాణించాల్సి ఉంది. బౌలింగ్‌లో అనుభవలేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుండగా... ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ కీలకం కానున్నారు. పేస్ ఆల్‌రౌండర్ సూర్యాషే షెడ్గే కంటే... స్పిన్నర్ హర్ష్ దూబేకే తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువ. గత జింబాబ్వే పర్యటనలో శతకంతో సత్తా చాటిన అభిషేక్ శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. గౌతమ్ గంభీర్ స్థానంలో ఈ సిరీస్‌కు వీవీఎస్ లక్ష్మణ్ భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. మరోవైపు సికందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే జట్టులో బెనెట్, మరుమని, మధెవెరె, బర్ల్, ఇవాన్స్, మసకద్జ రూపంలో నైపుణ్యం గల ఆటగాళ్లు ఉన్నారు. బౌలింగ్‌లో ఐపీఎల్ అనుభవం ఉన్న బ్లెస్సింగ్ ముజరబానితో భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు ముప్పు పొంచి ఉంది. పిచ్ పేసర్లకు సహకరించనుంది. కుదురుకుంటే పరుగులు చేయడం పెద్ద కష్టం కాదు. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

## టీమిండియాతో టెస్ట్ సిరీస్.. శ్రీలంకకు భారీ షాక్

స్వదేశంలో టీమిండియాతో టెస్ట్ సిరీస్‌కు ముందు శ్రీలంకకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ కుశాల్ మెండిస్ గాయం కారణంగా భారత్‌తో టెస్టులకు దూరమయ్యే అవకాశముంది. లంకా ప్రీమియర్ లీగ్ 2026లో కొలంబో కాప్స్‌కు సారథ్యం వహిస్తున్న మెండిస్.. గాలే గాలంటట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడ్డాడు. పరుగు తీసే క్రమంలో అతడి కుడి తొడ కండరాలు పట్టేశాయి. దీంతో అతడు తీవ్రమైన నొప్పితో విల్లవిల్లాడు. అనంతరం పరిగెత్తలేక రనౌట్ రూపంలో మెండిస్ ఔటయ్యాడు. తర్వాత అతడిని అస్పత్రికి తరలించి స్కాన్లు నిర్వహించగా.. గాయం తీవ్రమైనదిగా తేలింది.దీంతో కుశాల్ లంకా ప్రీమియర్ లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు అధికారికంగా ధ్రువీకరించింది. అతడు తిరిగి కోలుకునేందుకు నేషనల్ హై-పెర్ఫార్మెన్స్ సెంటర్‌కు వెళ్లనున్నాడు. కాగా భారత్-శ్రీలంక మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్ సమయానికి కుశాల్ కోలుకుంటాడో లేదో ఇంకా క్లారిటీ లేదు. ఒకవేళ అతడు దూరమైతే ఇది లంకేయులకు భారీ షాక్ అనే చెప్పాలి. కుశాల్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మూడు ఫార్మాట్లలోనూ అతడు అదరగొడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడు త్వరగా కోలుకుని తిరిగి మైదానంలో అడుగుపెట్టాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

